## క్లుప్తంగా

### వర్షం కోసం పూజలు

దహెగాం: పది రోజులుగా చినుకు జాడ లేకపోవడంతో పత్తి విత్తనాలు మొలకెత్తక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈనేపథ్యంలో శుక్రవారం రైతులు వర్షం కురవాలని పూజలు చేశారు. మండలంలోని భీమన్న దేవుడిని మండల కేంద్రంలోని వీధుల గుండా ఊరేగించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

### కౌటాలలో వర్షం

కౌటాల: మండలంలో శుక్రవారం రాత్రి మోస్తారు వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది. కొద్ది రోజుల నుంచి వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలు కురిస్తే వరి పంట సాగు చేస్తామని రైతులు పేర్కొంటున్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తిర్యాణి: మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు నిర్వహిస్తున్నందున శనివారం మండలంలోని గ్రామాలకు మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ కవిత ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆమె కోరారు.

### 'డైరెక్టర్ ఆదేశాలను పట్టించుకోవడం లేదు'

రెబ్బెన: డైరెక్టర్ ఆదేశాలను బెల్లంపల్లి ఏరియా అధికారులు పట్టించుకోవడం లేదని హెచ్‌ఎంఎస్ యూనియన్ ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు, కార్యదర్శి ఎండీ అరీఫ్ అన్నారు. శుక్రవారం జనరల్ మేనేజర్ దేవందర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ బెల్లంపల్లి ఏరియా సీహెచ్‌పీ అధికారులు అన్ని కార్మిక సంఘాలను సమానంగా చూడాలన్నారు. నాయకులు వెంకటేశం, రాంబాబు తదితరులు ఉన్నారు.

### పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

కాగజ్‌నగర్‌టౌన్: పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి డి.కిరణ్ డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ సమావేశాన్ని శుక్రవారం కాగజ్‌నగర్ పట్టణంలోని సంఘ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో అనేక సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికీ ఎస్టీ ఆశ్రమ పాఠశాలలు తెరుచుకోకపోవడం బాధాకరమన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు విద్యార్థుల భవిష్యత్తు గురించి ఆలోచించాలని పేర్కొన్నారు.

### జీఎం కార్యాలయం ఎదుట ధర్నా

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయం ఎదుట శుక్రవారం కాంట్రాక్టు కార్మికులు ధర్నా నిర్వహించారు. సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓదెలు మాట్లాడుతూ సమ్మెలో జరిగిన ఒప్పందాలను అమలు చేయాలన్నారు. సీఐటీయూ నాయకులు సత్తయ్య, లోకేష్, ప్రసాద్, ప్రవీణ్, విజయ్, వెంకటేష్, చిన్నుబాయి, శారద, అనిత పాల్గొన్నారు.

### విద్యాహక్కు చట్టం అమలు చేయాలి

ఆసిఫాబాద్‌రూరల్: విద్యాహక్కు చట్టం పకడ్బందీగా అమలు చేయాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ హేమంత్ బోర్కడేకు వినతిపత్రం అందించారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి మాట్లాడుతూ విద్యాసంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా పాఠశాలలు, వసతిగృహాల్లో విద్యార్థులు సౌకర్యాలు కల్పించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జిల్లాలోని చాలా పాఠశాలల్లో ఇప్పటివరకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పూర్తిస్థాయిలో అందలేదన్నారు. ప్రైవేట్ పాఠశాలలు ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు ప్రదీప్, హరిశ్చంద్ర ప్రసాద్, శ్యాం, దాసు, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

### కూరగాయల ధరలు

| కూరగాయలు | ధర(కిలో) |
|---|---|
| టమాటా | రూ.120 |
| సిమ్లామిర్చి | 100 |
| దోసకాయ | 60 |
| చామగడ్డ | 80 |
| వంకాయ | 60 |
| బీరకాయ | 100 |
| కాకరకాయ | 80 |
| బెండకాయ | 80 |
| అలసంద | 60 |
| దొండకాయ | 80 |
| పచ్చిమిర్చి | 120 |
| పాలకూర | 60 |
| సోరకాయ | 60 |
| చిక్కుడు కాయ | 100 |
| గోబి(పూల్) | 100 |
| క్యాబేజి | 60 |

-ఆసిఫాబాద్‌అర్బన్

# 'భారం'గా స్కూల్ బ్యాగు!

- విపరీతమైన సిలబస్‌తో పెరిగిన పుస్తకాల సంఖ్య
- బరువు మోయలేక పిల్లల అవస్థలు
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ యాజమాన్యాలు
- ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు



బ్యాగులతో విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులకు స్కూల్ బ్యాగు భారంగా మారుతోంది. విపరీతమైన సిలబస్‌తో పుస్తకాల సంఖ్య పెరిగి బ్యాగు బరువెక్కుతోంది. దీంతో పిల్లలు బ్యాగు మోయలేక అవస్థలు పడుతున్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ తమ సొంత సిలబస్‌తో పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాల సంఖ్య పెంచేస్తున్నాయి. పిల్లల బాధ చూడలేక కొంతమంది తల్లిదండ్రులు పాఠశాల వరకు తీసుకెళ్లి పిల్లలను దిగబెడుతున్నారు. పుస్తకాల బరువుపై ప్రభుత్వం ఐదేళ్ల క్రితమే మార్గదర్శకాలు జారీ చేసినా యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు.

**జిల్లాలో 138 ప్రైవేట్ పాఠశాలలు..**

జిల్లా వ్యాప్తంగా మొత్తం 747 పాఠశాలలు ఉన్నాయి. ఇందులోని 138 ప్రైవేట్ పాఠశాలల్లో సుమారు 16వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలల్లో ఒకప్పుడు ఆరు సబ్జెక్టులకు ఆరు నోట్‌బుక్స్‌తో పాటు ఒక రఫ్‌బుక్ ఉండేది. దీంతో విద్యార్థుల స్కూల్ బ్యాగు చాలా తేలికగా ఉండేది. కానీ ప్రస్తుతం గైడ్లు, ప్రాజెక్టు వర్క్ బుక్, డ్రాయింగ్ బుక్, స్క్రాప్ బుక్స్, రికార్డులు, డైరీలతోపాటు ప్రతీ సబ్జెక్టుకు ఒక రఫ్‌బుక్‌తో స్కూల్ బ్యాగు చాలా బరువెక్కింది. ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులు కిలోల కొద్దీ పుస్తకాలు మోసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. 6, 7వ తరగతుల విద్యార్థులు 6 నుంచి 12 కిలోలు, 8, 9, 10వ తరగతుల విద్యార్థులు 12 నుంచి 18 కిలోల బరువున్న బ్యాగులు మోస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో రెండో అంతస్తులో తరగతి గదులు ఉండడంతో అక్కడి వరకు బ్యాగులు మోస్తున్న కొందరు విద్యార్థులు వెన్నునొప్పి, కీళ్ల నొప్పుల బారిన పడుతున్నారు.

**అమలు కాని మార్గదర్శకాలు..**

చిన్నారులకు కిలోల కొద్దీ బ్యాగుల మోతను తగ్గించేందుకు రాష్ట్ర విద్యాశాఖ 2017లోనే మార్గదర్శకాలు జారీ చేసింది. వాటి ప్రకారం 1, 2 తరగతుల విద్యార్థులకు 1.5 కిలోలు, 3, 4, 5వ తరగతుల విద్యార్థులకు 3 కిలోలు, 6, 7వ తరగతులకు 4 కిలోలు, 8, 9, 10 తరగతులకు 5 కిలోల వరకు మాత్రమే బ్యాగు బరువు ఉండాలి. కానీ వీటికి విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు సొంత సిలబస్ పేరిట పుస్తకాలు, నోట్‌బుక్స్‌ల సంఖ్య పెంచి విద్యార్థులను ఇబ్బందులు పెడుతున్నాయి. అయితే విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ యాజమాన్యాల నుంచి కమీషన్లు తీసుకొని చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు విన్పిస్తున్నాయి.

### పుస్తకాల సంఖ్య తగ్గించాలి



పిల్లలకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ చాలా ఎక్కువగా ఉన్నాయి. దీంతో బ్యాగు చాలా బరువుగా ఉంటుంది. పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. పుస్తకాల సంఖ్య తగ్గించాలి. అధికారులు చొరవ చూపాలి.

- రవీందర్, ఆసిఫాబాద్

### పిల్లలు మోయలేకపోతున్నారు



మా బాబు 7వ తరగతి చదువుతున్నాడు. పుస్తకాల బరువు 15 కిలోల వరకు ఉంటుంది. బ్యాగు బరువుగా ఉండడంతో మోయలేకపోతున్నాడు. నేనే పాఠశాల వరకు తీసుకెళ్లి దింపుతున్నాను.

- శ్రీను, బూర్గుడ

### నిబంధనలు పాటించాలి



విద్యాశాఖ విడుదల చేసిన నిబంధనల మేరకు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు వ్యవహరించాలి. విద్యాశాఖ అధికారులు దృష్టి సారించి విద్యార్థులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలి.

- భీమేశ్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి

## ఓటరు నమోదు, సవరణలపై సమావేశం



సమావేశంలో పాల్గొన్న నాయకులు

పెంచికల్‌పేట్: తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఓటరు నమోదు, సవరణలపై తహసీల్దార్ సరిత, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామాల్లో ఇప్పటికే ఓటర్ల నమోదు, సవరణలపై క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహిస్తున్నామన్నారు. అభ్యంతరాలు, మార్పులు చేర్పులు ఉంటే స్థానిక బీఎల్‌వోలను సంప్రదించాలని సూచించారు.

### ఘనంగా ప్రతిష్ఠాపన పూజలు



ఊరేగింపులో పాల్గొన్న కోనేరు కృష్ణారావు, సతీమణి రుక్మిణి

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని కాపువాడ వార్డు నంబర్ 6లో శుక్రవారం మహాలక్ష్మి, భూలక్ష్మి అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపన, బోనాల పండుగ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. విగ్రహాలు, బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్ పిరిసింగుల జైచందర్‌తో కలిసి ముఖ్య అతిథులుగా జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు, ఆయన సతీమణి కోనేరు రుక్మిణి పాల్గొన్నారు.

### మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కౌటాల: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ మూడు రోజుల పాటు టోకెన్ సమ్మె చేయనున్నట్లు మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షురాలు శారద అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని విద్యావనరుల కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 11, 12, 13వ తేదీల్లో పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వంటలు బంద్ చేసి సమ్మె చేస్తామన్నారు. తమ డిమాండ్లు నెరవేర్చకుంటే ఈ నెల 14వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ నాయకులు నాగేష్, కార్మికులు విమల, కమల, హంస, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె



సిర్పూర్(టి): సమ్మె చేస్తున్న కార్మికులు



దహెగాం: మద్దతు తెలుపుతున్న బీజేపీ నాయకులు



కెరమెరి: నిరసన తెలుపుతున్న జీపీ కార్మికులు

దహెగాం: సమస్యల పరిష్కారం కోసం గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మె చేపట్టారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట సమ్మెలో ఉన్న కార్మికులకు బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు రాపర్తి ధనుంజయ్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులకు కార్మిక చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పుల్గం నారాయణ, ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు మల్లేశ్, నాయకులు పడాల సురేశ్, చప్పిడి సంజీవ్, తుమ్మిడె సురేశ్, కార్మికులు పాల్గొన్నారు.

**సిర్పూర్(టి)లో..**

సిర్పూర్(టి): గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మండలంలోని గ్రామపంచాయతీ కార్మికులు సమ్మె నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మి, భూమయ్య, నాగేష్, తారా, ఉర్గ, మారుతి, రాజన్న, సంజీవ్, రాజ్‌కుమార్, వినోద్, ధర్మారావ్, ఆసిఫ్, బాలు పాల్గొన్నారు.

**కెరమెరిలో..**

కెరమెరి: సమస్యల పరిష్కారం కోసం జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం రెండో రోజుకు చేరుకుంది. కార్మికులు వినూత్నంగా మోకాళ్లపై నిరసన తెలిపారు. కార్మికులు, కారోబార్లు నరేశ్, రాందాస్, పరమేశ్వర్, క్రిష్ణ, దత్తారాం, శ్రీకాంత్, సంతోష్, తిరుపతి, పుల్లయ్య, రవి, శ్రీనివాస్, వినేష్, ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

**జిల్లాకేంద్రంలో..**

ఆసిఫాబాద్‌అర్బన్: పంచాయతీ కార్మికుల డిమాండ్లను సత్వరమే నెరవేర్చాలని సీఐటీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి పాలడుగు సుధాకర్ డిమాండ్ చేశారు. కార్మికుల డిమాండ్ల పరిష్కారం కోసం ప్రారంభించిన నిరవధిక సమ్మె 2వరోజు శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట కొనసాగింది. కార్యక్రమంలో నాయకులు సీహెచ్ శంకర్, సమ్మయ్య, మట్టరాజు, శ్రీకాంత్, ప్రభాకర్, మహేష్, సునీల్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

**రెబ్బెనలో..**

రెబ్బెన: రాష్ట్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను అమలు చేయకుండా పంచాయతీ కార్మికుల శ్రమను దోపిడీ చేస్తుందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట రెండో రోజు సమ్మెలో పాల్గొని మద్దతు తెలిపారు. కార్మికుల న్యాయపరమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు సుధాకర్, రమేశ్, వెంకటేష్, దేవాజీ, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

**కౌటాలలో..**

కౌటాల: పంచాయతీ కార్మికుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ మండలంలోని పంచాయతీ కార్మికులు శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట సమ్మె చేపట్టారు. కార్మికులకు రూ.19వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులు జాడి మోరేశ్వర్, మోర్లె నాగేశ్, బనీత్ ప్రకాశ్, కర్ణకార్, దేవాజీ, గణపతి తదితరులు పాల్గొన్నారు.

**వాంకిడిలో..**

వాంకిడి: గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెలో పాల్గొని మాట్లాడారు. నాయకులు దుర్గం ప్రసాద్, అశోక్, కట్టరామ్, నానాజీ, గోపాల్, ప్రభాకర్, దేవికా, హరిదాస్, చంద్రకళ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: మండలంలోని ఆయా పంచాయతీలలో పని చేస్తున్న పంచాయతీ కార్మికులు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

## శిశుమందిర్‌లో గోరింటాకు సంబురాలు



సంబురాల్లో పాల్గొన్న విద్యార్థులు, సభ్యులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని సరస్వతీ శిశుమందిర్‌లో ఆషాఢమాసం పురస్కరించుకొని మాతృమండలి సభ్యుల ఆధ్వర్యంలో గోరింటాకు సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు సామూహికంగా గోరింటాకు పెట్టుకొని వేడుకల్లో పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయుడు గుండేటి కోటేశ్వర రావు, మాతృమండలి సభ్యులు వైష్ణవి, ఉమ, అమరావతి, శారద, సరిత, అస్మిత, అరుణ విద్యార్థులు పాల్గొన్నారు.

### పాఠశాలలో పాముల సయ్యాట



కౌటాల: మండలంలోని తలోడి ప్రాథమిక పాఠశాల ఆవరణలో శుక్రవారం రెండు పాములు జతగా సయ్యాటలాడాయి. కొందరు యువకులు ఫోన్‌లో వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతో వీడియో వైరల్ అయ్యింది. కాగా శుక్రవారం పాఠశాలకు సెలవు కావడంతో పాఠశాలలో విద్యార్థులు లేరు. పాఠశాల ఆవరణలోకి పాములు రాకుండా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

## చెట్లతోనే ప్రాణ కోటికి మనుగడ



కెరమెరి: మొక్కలు అందజేస్తున్న అధికారులు

బెజ్జూర్: చెట్లతోనే ప్రాణకోటికి మనుగడ ఉంటుందని ఏపీవో చంద్రయ్య అన్నారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీఎస్‌హెచ్ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజేష్, బీఆర్‌ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడు నరేందర్ గౌడ్, నాయకులు జావిద్, సురేశ్ గౌడ్, బక్కన్న, వెంకటి, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ రవి, కార్యదర్శి పెదం తుకారాం, పాఠశాల సిబ్బంది శ్రీనాథ్, శ్రీనివాస్, జమీల్, కపిల్, పుణేష్, నాగుల రవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

**నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలి**

కెరమెరి: నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఈజీఎస్ ఏపీవో మల్లయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని నర్సరీలో గల మొక్కలను రైతులకు అందించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఉపాధి సిబ్బంది రైతులకు మొక్కలు అందించి సంరక్షించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం దేవాపూర్ నర్సరీని పరిశీలించారు. ఎవెన్యూ ప్లాంటేషన్‌లో మొక్కల కోసం గుంతలు తవ్వించారు. కార్యక్రమంలో ఈసీ ఐక్య నాయక్, టీఏ ధరంసింగ్ తదితరులు ఉన్నారు.

## ప్రవీణ్‌కుమార్ పర్యటన విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

కౌటాల: బీఎస్పీతోనే బడుగు బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యమని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆరె సంఘం భవనంలో బీఎస్పీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం గాలికొదిలేసిందన్నారు. శనివారం సిర్పూర్(టి) నియోజకవర్గానికి బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ రానున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో వారం రోజుల పాటు పర్యటిస్తారన్నారు. పార్టీ కార్యకర్తలు, ప్రజలు పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ మండల నాయకులు దుర్గం వెంకటేశ్, దిలీప్, మోరేశ్వర్, మంగేష్, గులాబ్, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ జెండావిష్కరణ



రెబ్బెనలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

రెబ్బెన: మండలంలోని గోలేటిలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ నాయకులు జెండావిష్కరించారు. ఎమ్మార్పీఎస్ దండోరా 29ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జెండా ఆవిష్కరించినట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగంపల్లి ప్రభాకర్ తెలిపారు. అనంతరం మందకృష్ణ మాదిగ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. నాయకులు ధన్కుమార్ మాదిగ, దేవేందర్, మాతాంగి స్వామి, కాంపెల్లి రమేశ్, కన్నం అశోక్, లచ్చన్న, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా ఎమ్మార్పీఎస్ వార్షికోత్సవం**

చింతలమానెపల్లి: మండలంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ 29వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఖర్జెల్లి, రుద్రాపూర్, బాబాసాగర్ తదితర గ్రామాల్లో జెండాలు ఆవిష్కరించారు. వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల పిలుపు మేరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గోరంట్ల బుచ్చయ్య, రామయ్య, మహేష్, అశోక్, శ్రీనివాస్, విలాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వనంలో పశువులు




జిల్లాలో పల్లె ప్రకృతి వనాల నిర్వహణ అధ్వానంగా మారింది. రూ.లక్షలు ఖర్చు చేసినా ప్రజలకు ఆహ్లాదం అందడం లేదు. కౌటాల మండలం సాండ్‌గాంలో పలు రకాల మొక్కలు నాటి, చుట్టూ ఫెన్సింగ్ వేశారు. గేటు కూడా ఏర్పాటు చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా ఇటీవల స్థానికులు కొంత మంది గేటు తీసి, ప్రకృతివనంలోకి పశువులను మేతకు వదిలారు. దీంతో 20కి పైగా పశువులు ఇష్టారీతిన తిరుగుతూ మొక్కలు ధ్వంసం చేశాయి. - కౌటాల

## సంక్షిప్త వార్తలు

**పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత**

వాంకిడి: సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా స్వాధీనం చేసుకొని బాధితుడికి అప్పగించినట్లు సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఖమాన గ్రామానికి చెందిన పందిర్ల పెంటయ్య గురువారం సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేయగా పోయిన సెల్‌ఫోన్‌ను గుర్తించి బాధితుడికి శుక్రవారం అందజేశారు.

రెబ్బెన: మండల కేంద్రానికి చెందిన దుర్గారావు ఫోన్ పోగొట్టుకొని పోలీసులకు ఫిర్యాదు చేయగా ఫోన్‌ను గుర్తించి శుక్రవారం ఎస్సై భూమేశ్ బాధితుడికి అప్పగించారు.

**రోడ్డు పనులు ప్రారంభం**

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని చింతగూడ గ్రామంలో శుక్రవారం సీసీరోడ్డు పనులను జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు ప్రారంభించారు. రోడ్డు నిర్మాణానికి రూ. 3లక్షల నిధులు మంజూరు కాగా పనులు ప్రారంభించారు.

**మాదారం కాలనీ సమస్యలు పరిష్కరించాలి**

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా పరిధిలో మాదారం కాలనీ సమస్యలు పరిష్కరించాలని జీఎం దేవేందర్‌కు శుక్రవారం కాలనీవాసులు వినతిపత్రం అందించారు. కాలనీలో కొన్ని నెలలుగా సెకండ్ షిఫ్ట్‌లో విద్యుత్ సరఫరా చేస్తున్నారని, దీంతో మొదటి, రాత్రి షిఫ్ట్‌ల్లో పనిచేయలేక ఖాళీగా ఉంటున్నామన్నారు. రాజు, అశోక్, కోటి, క్రిష్ణ, ప్రసాద్, వీరన్న, జహంగీర్, శ్రీను, శ్రీనివాస్ ఉన్నారు.

**సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం**

పెంచికల్‌పేట్: పోడు రైతులకు పట్టాలు పంపిణీ చేసిన నేపథ్యంలో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే కోనప్పల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కొండపెల్లిలో శుక్రవారం సర్పంచ్ ఉపాసి సంజీవ్ ఆధ్వర్యంలో పోడు రైతులు క్షీరాభిషేకం నిర్వహించారు.

**సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలి**

రెబ్బెన: రాష్ట్రంలో ఎన్‌హెచ్‌ఎం స్కీంలో భాగంగా పని చేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్ సుప్రియకు వినతిపత్రం అందజేశారు. సునీత, ప్రమీల, తులసీ, వనిత, పద్మ పాల్గొన్నారు.

**రాజ్యసభ సభ్యుడిని కలిసిన పాల్వాయి**

కాగజ్‌నగర్‌టౌన్: రాజ్యసభ సభ్యుడు, బీజేపీ పార్లమెంటరీ బోర్డ్ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్‌ను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, సిర్పూర్ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు శుక్రవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.

**బ్యాగుల పంపిణీ**

తిర్యాణి: మండలంలోని రొంపెల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కొలాంగూడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుభి సహాయ సర్వీస్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు శుక్రవారం ఉచితంగా బ్యాగులు పంపిణీ చేశారు.